

# ఆశయం

అరుంధతీ సుబ్రహ్మణ్యం

**ఆల్లనల్లన గాలికి కొబ్బరి ఆకులు కదలాడుతున్నాయి. చల్లని గాలి శరీరానికి తగిలి పులకింపచేస్తోంది వాతావరణం, ఇంతలోనే విసురుగా వీచిన గాలికి పైట చెంగు ఎగిరి ఆమె ముఖాన్ని కప్పి దోబూచులాడింది.**

చెదరిన ముంగురులను సవరించుకొంది. పమిటను బిగించి, నడుం చుట్టూ చుట్టింది. ఇంతసేపూ తానేం చేస్తోంది? ఎక్కడుంది? ఎందుకీ ఆలోచన? అన్నిటికీ సమాధానం నిట్టూర్పే కనిపించిందామెకు.

అవును! నిట్టూర్పుగాక మరేం మిగులుతుంది? కన్నె వయసులో కోరికలు చెల

కేగటం తప్పా? ఆ కోరికల ఊహల్లో ఊహల్లో లోకంలో విహరించటం తప్పా? ఏది తప్పో? ఏది ఒప్పో? తెలియక కొట్టు మిట్టాడుతోంది మనసు. తన యీడు వారప్పుడే యిల్లాండ్రుగా, తల్లులుగా స్థిర పడిపోయేరు. హుః తనకే!

తనకేం తక్కువయిందని? నలుగు రున్న యింట్లో పుట్టింది! తనకే లోటు లేకుండా తల్లిదండ్రులు పెంచేరు. వయసు, వయసుతోపాటు కోరికలు పెరగసాగాయి. దీనికి తోడు అందం జోడైంది. కాని - కావి కావలసిందే తక్కువ!

* * *

రామనాథంగారి మూడో కూతురు జ్యోతి. పెద్ద అందగత్తె కాకపోయినా అందమైన పిల్లనే అంటారంతా! స్కూలు ఫైనల్ పూర్తయినప్పటినుండి తల్లి పెళ్లి చేయాలని భర్తను పోరు పెడుతూనే వుండేది.

"తొందరెందుకే! మన అమ్మాయికేం తక్కువ, అంటూనే కాలేజీలో చేర్పించారు. బుద్ధిగా కాలేజీకి వెడుతూ ఒక్కొక్కమెట్టే గట్టెక్కింది. బి. ఎ. పూర్తి చేసింది. 'హమ్మయ్య' అనుకుంది తను. అనుకున్న పని పూర్తి చేసినందుకు ఆనందం వెల్లివిరిసింది తండ్రి ముఖంలో. ఇప్పటికేనా పెళ్ళి ప్రయత్నాలు చేస్తారా? లేదా? అంటూ నిలదీసి అడగసాగింది తల్లి. వీరందరినీ చూసి వింతగా నవ్వుకుంటూ, కాలెండరు కాగితాలు గల గల తిరగసాగాయి.

ఆ రోజు రామనాథం బంధువైన జగన్నాథంగారు వస్తూనే 'రామం!నువ్వింక పెళ్ళి మాటేదైనా తలపెట్టున్నావా? లేదా?' అంటూ, వచ్చి వరండాలోనే వున్న వాలు కుర్చీలో కూర్చుంటూ, ముక్కు పొడుం డబ్బా లాల్చీ జేబులోనుండి తీస్తూ అన్నారు.


ఆయనగారి మాటకు ముందు విస్తుపోవటమయినా, ఆ తరువాత సద్దుకున్నారు రామనాథంగారు!

"అలా నలుగురు అడిగితేనే ఆ మనిషి బుర్రకెక్కదు, అంటున్నట్లుగా చూస్తున్నాయి రామనాథంగారి అర్ధాంగి సుమిత్రమ్మ చూపులు. అందరి మాటెలా వున్నా, యింట్లో పెళ్లి జరగాలి, లడ్డూలన్నా తినాలని నోరూరించుకొంటున్నారు చిన్నపిల్లలు.

"ఛా! పొండర్రా! వెర్రి చూపులూ మీరూనూ," అంటూ గదమాయించి వారి నవతలకు పంపి, వారి సంభాషణలను వినటానికై పిల్లిలా తలుపుచాటున నక్కింది జ్యోతి.

"అన్నగారూ! మంచి సంబంధం వుంటే చెప్పమనూ!" అంటూ అసలు రంగంలోకి దిగింది సుమిత్రమ్మ.

"సుమిత్రమ్మా! మన వాళ్ళే! పిల్లాడు బుద్ధిమంతుడు. యోగ్యుడు. చదువుకున్న వాడు! మన పిల్లంటావా, జ్యోతి జ్యోతే! ఈ సంబంధం కుదిరితేనా అదృష్టవంతు




"లమే!" అంటూ ఆగారు. భర్త ముఖం కేసైనా చూడకుండా వెంటనేఅందుకుంటూ "మీరే అన్ని ఏర్పాట్లు చెయ్యండన్నయ్యగారు! ఆయనకేం శ్రద్ధలేదు." అంటూ అప్పుడే పెళ్లి నిశ్చయమయినంత సంబర పడిపోతూ అంది సుమిత్రమ్మ.

"మనవాడు సరేనంటే ఎంతసేపూ? రేపే ఏర్పాట్లన్నీ చేసేస్తాను," అన్నారు పెద్దమనిషిగా.

"మీరంతగా చెప్తూంటే ఎలా కాదన గలను? మీరు, మీ చెల్లెలు ఒకటయినాక, నాదేం వుంది?"

"అదేమిటోయ్! ఇది నీ పిల్ల వ్యవహారమని గుర్తుంచుకో!" అంటూ ముక్కు-పొడుం పీల్చుకున్న చేతిని తుండు గుడ్డకు తుడుచుకుంటూ అన్నారు.

ముగ్గురూ సరేనంటే, సరేననుకోవటం విని, జ్యోతి తుర్రున గదిలోకి జారుకుంది.

• • •

ఇల్లంతా హడా విడిగా వుంది. అగరు వత్తుల వాసన గుబాళిస్తోంది. అటూ, యిటూ అర్థం కాని కంగారుతో తిరుగుతున్నారంతా.

జ్యోతి కళ్ళెదుట సుందరాకారుడు నిలబడ్డాడు. రివిసి చూపించే ఆ విగ్రహం, చెదిరే ముంగురులు. చిలిపిగా నవ్వే ఆ కళ్ళు—ఓహ్! 'అమ్మాయ్! జ్యోతీ లే, అవతల పెద్ద మనుషులొచ్చారు,' అంటూ తల్లి భుజం తట్టి లేపేదాకా ఆ సుందర మూర్తిని కనులనిండా పూజించుకుని తన్మయురాలైయింది.

"పిల్లకు యింటి పనంతా వచ్చునండి. బి. ఎ. చదివింది," అంటూ యింకా చెప్ప బోతున్న సుమిత్రమ్మకు అడ్డువస్తూ, మధ్య వర్తిగారైన, జగన్నాధంగారు "జ్యోతీ! ఒక్కసారి పిల్లాడిని నువ్వూ చూడమ్మా!" అంటూ దగ్గరగా వచ్చి అన్నారు. ఆ మాటలకు సిగ్గుపడుతూ చిరు భయంతో తలెత్తి, కళ్ళను పైకి లేపి, తనూహించిన సుందరాకారుణ్ని చూడ ప్రయత్నించింది. ఇద్దరి కళ్ళు కలుసుకున్నాయి. మనసు లేవేవో మూగగా మాట్లాడుకున్నాయి. అందరి ముఖాల్లో సంతృప్తి కనిపించింది. అన్నీ పూర్తి చేసుకుని పెళ్లి పెద్దలు లేచారు.

"ఇంటికెళ్లి విషయం వ్రాస్తామండి" అంటూ యిల్లు వదిలారు వారు.

జగన్నాధంగారి ద్వారా, పిల్ల వారికి నచ్చిందని తెలుసుకొని అందరి మనసులు ఒకింత తేలికపడ్డాయి.

* * *

వారం రోజులు గడిచాయి. పోస్టు మేన్ కోసం ఎదురు చూడటం అలవాటు అయిన పనులలో ఒకటయింది. ఓ మధ్యాహ్నంవేళ, ఎండలు విపరీతంగా కాచే వేళలో, గాడుపు వీచే సమయంలో, ఓ కవరందుకుంది జ్యోతి.

మిస్ జ్యోతిగారికి,

మిమ్మల్ని చూడటంతోనే నాకెంతో ఆనందం కలిగింది. నాకు ఎంతో బాగా నచ్చారు. మా వాళ్ళకు కూడా అంతే! ఇంత చొరవగా నేనెందుకు వ్రాస్తున్నానో మీ రూహించలేరు. నా కెప్పుడూ ఎదుటి వారితో ఫ్రీగా మాట్లాడటం అలవాటు. మనం కాబోయే .... అందుకనే చెప్తున్నా మీరు ఎం. ఎ. పూర్తి చేయండి. వివాహ మయితే చదువుమీద శ్రద్ధ తగ్గిపోతుంది. నాకూ విదేశాలకు వెళ్ళేఅవకాశాలున్నాయి. అప్పటికేమో మీ చదువు పూర్తవుతుంది. అప్పుడు .... అంతవరకూ నేను మీకై ఆగగలను. ఈ విషయం తెల్పటానికే ఈ చొరవ తీసుకున్నాను. ఇంతే

ఇట్లు

ప్రసాద్.

ఉత్తరం సాంతం చదివిన జ్యోతికి ఆనందం, విచారం రెండూ కలగాపులగంగా వచ్చి ఉక్కిరిబిక్కిరయింది. నచ్చినందుకు, తనకోసం అంతవరకు వేచి వుంటానన్నందుకు ఆనందంకాక మరేమిటి?

కాని....తను పై చదువు ఎలా చదవాలి? ఆ ప్రశ్నే ఆమెను క్రుంగదీసింది. ఆ ఉత్తరాన్ని తండ్రికి అందించింది.

"చాల్లెండి! ఈ మాత్రం సంబంధం యింకరాకపోదు. నచ్చితే చేసుకోవాలి గాని యిదేం కోరిక, మరీ చోద్యంగా వుంది.' అంటూసుమిత్రమ్మ సాగదీసింది.

'ఇందులో అంతగా అనుకోవలసిం దేముందే! అతనికి మనసులో వుంది వ్రాసేడు. అయినా కాదని అతనూ అనటం లేదుగా! విదేశాలకు వెళ్లే కుర్రాడు ఎం.ఏ

అయిన పిల్లను కావాలనటం తప్పా?' అంటూ భార్యను మందలించాడు.

'అబ్బే! వారు కోరటం తప్పు లేదు, మనం కాదనటం కూడా తప్పులేదు....'

'చాల్లే....' అన్నాడు భార్య నుద్దేశిస్తూ.

అప్పటికే జ్యోతిలో అనేక ఆలోచనలు తరంగాలుగా వచ్చి ఎగిసి, ఎగిసి పడ్తున్నాయి. ఎటూ తాను నిలబడలేక పోతోంది. రెండు రోజులు తీవ్రంగా యోచించి, 'నాన్నా. నేను ఎం. ఏ. చదవ దలచుకున్నాను,' అంది. ఆయన ఆశ్చర్యానికి అంతులేదు. 'అమ్మా జ్యోతీ. నువ్వా' అని మాత్రం అనగలిగేరు. 'అవునని' మాత్రం అని లేచి వెళ్ళిపోయింది.

* * *

రామనాథంగారిది చెప్పుకునేంతటి విశేషమున్న కుటుంబం కాదు. సంతానం ఆరుగురు. పెద్ద పిల్లలిద్దరికీ కావలిసిన వారితోనే సంబంధం కలుపుకున్నారు. పెద్దగా ఖర్చు కాలేదు. మూడోది జ్యోతి మిగతా ముగ్గురిలో ఎవరూ చేతికి అంది వచ్చిన వారు కారు. ప్రతినెలా ఆటూ పోటూ పడుతూనే సంసారాన్ని నెట్టుకుంటూ వస్తున్నారు. అలాగే జ్యోతిని బి. ఏ దాకా చదివించ గలిగారు. ఇంకా యీ చిన్న పిల్లలనెంతదాకా చదివించ గలరో ఆయనకే తెలియదు. ఇలాంటి వ్యక్తి పెళ్ళిలా చేయగలడు? అదీ సమస్య ఆయనలాంటి మధ్య తరగతి మనిషికి కాని ఆశను చంపుకోలేరుగా!

* * *

తల్లి పోరు పెట్టున్నా వినక, తండ్రి పరిస్థితి తెలిసికూడా, జ్యోతి ప్రయివేటుగా పరీక్షకు కట్టింది.

తెలిసిన నలుగురి పిల్లలకు ప్రయివేట్లు చెప్తూ, స్నేహితులవద్ద పుస్తకాలు తెచ్చుకుని కాలంతో పోరాడుతూ జ్యోతి ఎం. ఎ. పట్టభద్రురాలయింది. రామనాథం గారి ఆనందానికి అవధుల్లేవు. ఇంతకాలం పడిన శ్రమంతా మరిచిపోయి. ఊహా జగత్తులో తేలిపోయింది జ్యోతి!

* * *

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సా
విరేచనముతో
చికిత్సను పొందండి
— శస్త్రచికిత్స
అవసరములేదు!
Benson-2141-TEL

అదే ముఖం, అదే నడక ఆమెకు చేరువగా వచ్చి నిలబడింది. వీచే గాలికి చెదిరిన క్రాపింగును సరిచేసుకుంటూ.

'జ్యోతీ.' తియ్యగా, మెల్లగా పిలిచాడు.

'ఊఁ' మందంగా అంది.

'నా కోరిక తీర్చి, నా ఆశల శిఖరాల నందుకుంటున్న నిన్ను ...' ఆగిన అతని వైపు రెప్పలెత్తి చూస్తూ,

'ప్రసాద్!'

'ఊఁ ....'

'నాకై యింతకాలం ఆగిన నిన్ను ఎలా పొగడాలో—'

'ఉష్! నా కంతా తెలుసులే! అంతలా నన్ను ఎత్తితే, తిరిగి నిన్ను నిజంగానే ఎత్తవలసి వస్తుంది.'

'ఉష్: నలుగురూ వింటారు!' అంటూ చూపుడు వేలును నోటికి, ముక్కుకు తగిలించి అంది.

'వచ్చే నెల స్టేట్సుకు వెడదాం. ఈ లోపుగా హనీమూన్ ట్రిప్పు ఎక్కడికెళ్లాలో చెప్పు!' అంటూ ఆమె బుగ్గలపై వ్రేలితో రాస్తూ అన్నాడు.

'ఇప్పటికే నా మనసు ఆనందంతో నిండిపోతోంది. ఇంక నేనేమీ చెప్పలేను ప్రసాద్.' అంటూ అతని విశాలమైన ఛాతీమీద వాలిపోయింది.

'జ్యోతీ!' మెల్లగా అంటూ ఆమెను హృదయానికి అద్దుకుంటూంటే, ఆమె శరీరం గాలిలో తేలిపోతోంది.

'అక్కా! అక్కా!' అంటూ పిలిచే తమ్ముడి కేకతో ఉలిక్కిపడి తలెత్తింది. తనున్నది ఎక్కడ? ఇంతసేపూ తనెక్కడ విహరించిందో గుర్తుకు తెచ్చుకుని,

ఓహో! ఇదంతా కలా? ఈ స్వప్నం లోనా తాను తిరిగింది? ఈ ఆనందమంతా ఊహా లోకంలో పొందినదా? వెంటనే సిగ్గు దొంతరలు ముంచుకు రాగా, ఎరుపెక్కిన బుగ్గలతో తమ్ముని వైపు చూస్తూ 'ఏరా! అంత గట్టిగా పిలిచావ్' ఆమె స్వప్నం చెదిరినందుకు విసుగ్గా ముఖం పెట్టి అడిగింది.

'మరేమోనే! నీకు ఉత్తరం వచ్చిందే' అంటూ అందించి, తుర్రున వెళ్లిపోయాడు. తన కోరిక తీరే శుభసమయం ఆసన్నమవుతోందా? అనిపించింది. అడ్రసు రామనాధంగారిపేర వుంది. తనకని ఎలా చెప్పాడబ్బా? అనుకుంటూనే తల్లి పంపించిందేమో అనుకుంటూనే కవరు చింపింది.

రామం!

నువ్వు నీ పిల్ల పెళ్లి విషయంలో ఆలస్యం చేసేవు. ఎంత చెప్పినా నిర్లక్ష్యం చేసేవు. ప్రసాద్ పెండ్లి పత్రిక యిందులో పంపుతున్నాను. అతను రెండు నెలల క్రితమే వివాహం చేసుకుని విదేశాలకు వెళ్లిపోయాడు. అతనే వస్తాడనుకున్నావే గాని, అతని చుట్టూ తిరిగే మనుషుల గురించి నువ్వు ఆలోచించలేకపోయావు. అయిందేదో అయింది. ఇందులో యింకో




జాతకం పంపుతున్నా. చూసి చెప్తే ప్రయత్నిస్తా.

ఇట్లు
జగన్నాథం.

చేతిలోని ఉత్తరం జారి క్రిందపడింది. తల గిర్రున తిరిగింది. కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి.

అవును! తానెందుకుగాను అతనికోసం వేచి చూచింది? నిజంగా అతని కోసమే తానీ చదువు చదివిందా? అతన్ని తన వానిగా నిశ్చయించుకునే కలలు గనిందా? ఏది ఎందుకుగాను చేసింది? ఎవరి కోసం చేసుకుంది? ఏ ప్రశ్నకు జవాబు దొరకక నేలమీద పడుకొని వలవలా కన్నీరు కార్చింది. ప్రసాద్ యీ మోసానికి ఎలా దిగాడు. అయినా తన పిచ్చిగాని ముక్కూమొఖం తెలియని వ్యక్తి రాసిన మాటల కంత విలువ తనివ్వటం ఏమిటి? పై చదువు చదవాలని, లేనితలంపు ఆతనా కోరిక తెల్పటంతో చిగిర్చి, శాఖలై, ఎంతో ఎత్తు ఎదిగిపోవటం దేనికి? తనకు జరగవలసిన శాస్తే జరిగిందనుకుంటూ విలవిల్లాడే మనస్సును అదుపులోకి తెచ్చుకోసాగింది.

* * *

తల్లి తిట్లు, తండ్రి నీరసం ఆమెను క్రుంగదీయసాగాయి. నెల రోజులు నిద్రాహారాలు మాని ఆలోచించింది. వివాహం చేసుకోనిదే స్త్రీ బ్రతక లేదా? ఆ భర్త అడుగు జాడల్లో నడవందే స్త్రీగా జీవితం

నెట్టుకురాలేదా? తోడులేనిదే ఒంటరిగా ప్రయాణం చేయలేదా? తోడు ఎవరెంత కాలం రాగలరు? ఆ తరువాత గతి? ఏమీ లేని వారి గతేం కావాలి?

పిచ్చి పిచ్చి ఆలోచనలతో గడిపి, చివరకు తాను బతకాలి. తనవారి కోసం, తనకోసం, తోడు లేకుండా యీ నావని నడిపించి తీరం చేర్చే బాధ్యత తాను స్వీకరించి, ఆ ప్రసాద్‌లాంటి వాళ్ళ కళ్ళు తెరిపించాలి. స్త్రీ ప్రళయ స్వరూపిణి; శాంతమే ఆమె సొత్తు కాదు. ఉగ్ర రూపిణియై జగాన్నంతా వణికించే రుద్ర మూర్తి.

డాక్టరుగా ఒక కోణం లాయరుగా మరో దిక్కు, వారనారిగా మరోవైపు, పరిపాలనా దక్షురాలిగా, యోగినిగా సాత్వికురాలిగా, ఓహ్ ఒకటేమిటి, అన్ని దిక్కులనుండి కదిలించివేసింది స్త్రీ రూపం.

ఇంకగా పురోభివృద్ధి చెందిన స్త్రీ ఒంటరిగా జీవించలేదా! తనలోనే ప్రశ్నించుకుంది!

• • •

తండ్రి రామనాధంగారి కృషి వల్ల, జ్యోతి శ్రమపడి పి.హెచ్.డి. కానిచ్చింది ఇంటి చాకిరీచేస్తూ, తన విద్యలో ఆశక్తి కనబరుస్తూ ఆమె స్వయంకృషితో పైకి వచ్చింది.

* * *

ఆ రోజు విమానాశ్రయం చేరుకుంది. తల్లిదండ్రులు ఆనందబాష్పాలతో వీడ్కోలిస్తున్నారు.

"అమ్మా! నీ కూతురు ఒంటరి కాదమ్మా! మీరింతా వుండగా, యింతమంది స్నేహితులుండగా, నాకేం దిగులులేదు వెంటనే వచ్చేస్తాగా!" అంటూ తల్లి చేతిని గట్టిగా నొక్కి విడిచింది.

"జ్యోతీ! ఉత్తరాలు వ్రాస్తూవుండూ; అంటున్న తండ్రికి టా, టా, చెప్తూ, విమానంవైపు నడకసాగించింది. మెల్లగా గాలిలోకిపోతున్న ఆ విమానంతోపాటు ఆమె మనసుకూడా ముందుకు పరుగులు తీసింది.

* * *

హాలులోకి అడుగెడ్తున్న జ్యోతిని ఒక వ్యక్తి గుర్తుపట్టగించి చూడసాగాడు.

"హల్లో! ప్రసాద్! అంటూ జ్యోతి పలుకరించింది.

అతను రెప్పలు టపటపలాడిస్తూ "జ్యోతీ", అన్నాడు.

"ఇక్కడికెలా వచ్చావనికదూ! అంటూ అన్నట్లుగా చూసిందతనివైపు.


"అదే—యిక్కడికి!"

"అదేం పెద్ద ప్రశ్నకాదులే ప్రసాద్! ఆనాడు నువ్వు చూపించిన తిరస్కారమే నన్నింతదానిగాచేసింది ఇంతకూ మీ శ్రీమతి————!

అతని ముఖం పేలవంగా మారిపోయింది. తలవంచుకుంటూ

"లేదు...."

ఆమె ఆశ్చర్యంగా చూస్తూ—




"అంతే;

"లేచి వెళ్లిపోయింది జ్యోతీ;' నుదురు పట్టుకుంటూ అన్నాడు.

"ప్రసాద్! ఆమెకిష్టంలేదా;"

"జ్యోతీ! అటురా, అక్కడ కూర్చుని మాట్లాడుకుందాం!" అంటూ నడుస్తున్న అతన్ని అనుసరించింది.

తిరిగి మనసు అతని వైపు లాగుతోంది! ఏ ఆకర్షణకో తాను లోబడిపోతోంది. తానిక్కడకి వచ్చిన ఆశయం వేరు! ఇప్పుడు జరగబోయేది వేరు! తొందర పడితే—;

'పరధ్యానంగా వున్నావ్;' అంటూ ఒక కుర్చీలో కూర్చున్నాడు. చాలా నిశ్శబ్దంగా ఎవరి పనులు వారు చేసుకునిపోతున్న వారిని చూస్తూ, ఇంత నియమాన్ని పాటించేవారిలో, నీతికి కట్టుబడే స్వభావం చాలా తక్కువెందుకు?; అనిపించిందామెకి

అందమైన ఆ ముఖం, చిరునవ్వు చిందే ఆ లేత పెదవులు! తామరకాడ లాంటి, ఆ వేళ్లు, ప్రసాద్‌ను పరవశింప చేశాయి.

"జ్యోతీ!;


ఇదే పిలుపు ఆ రోజు తన స్వప్నంలో వినిపించి, తన నెక్కడికో తీసుకుని వెళ్ళిపోయింది. తిరిగి అదే—;

"జ్యోతీ! నిన్ను కాదని నేను వేరొక వివాహం చేసుకున్నందుకు మన్నించు!"

"ఇప్పుడిదంతా దేనికిలే!;

"నా మనసులో నీ రూపం యింకా నిలిచేవుంది." గుండెలపై చేతులుంచుకుంటూ అన్నాడు.

"అంతటివాడివి, నన్ను దగా చేయటంలో అర్థం?"




"అక్కడే బోల్తా పడ్డాను. ధనానికి ఆశించాను. పెద్ద చదువు చదవాలంటే డబ్బే! అందుకే—"

"మరి నేనెలా చదివానో తెలుసా?"

'ఆ' అన్నాడు. తిరిగి అందుకుంటూ,

"ఆమె ఆంగ్లోయిండియన్‌ది. స్నేహం మారి ప్రణయంలో దిగింది. నా డబ్బుపైనే ఆమె కన్నుందని నేను తెలుసుకోలేక పోయాను.

"అదంతా యెందుకులే;—

"ఒక మాట....:

"చెప్పు,"

"నీకభ్యంతరం లేకపోతే—;

"పెళ్ళిచేసుకుంటారు. అంతేనా?;

అవునన్నట్లుగా వున్నాయి అతని చూపులు.

ఆమె అతన్ని పరిశీలించి చూసింది ఏదీ మార్పు కనిపించలేదు. మనసు వశం తప్పకుండా గట్టిగా నొక్కుకుంటూ, యీ బంధంలో చిక్కుకుని, తను ఆశయ విరుద్ధంగా బ్రతకటానికి మనసంగీకరించలేదు జ్యోతికి

"ప్రసాద్! లాభంలేదు. ఆరోజే నువ్వు వచ్చివుంటే నాకోరిక తీరేది. కాని సమయం మించిపోయింది. నీ మాటలు నమ్మి, తిరిగి ఊబిలోకి దిగను. ముందే ఏ ఆలోచన లేని నీతో కలకాలం నిలవడం దుర్లభం.

ఈ జీవితం యింకొకరికి అర్పించేది కాకూడదు నా వల్ల నలుగురికి ఉపయోగించేవిధంగా నడుచుకో దలచాను.

ఒంటరిగా పయనించే తీరం చేర దలచేను.ఇందులోఎంతవరకూ గెలుపొందగలనో చెప్పలేను.

నా ఆశయం, ఒంటరిగా మా సంసార భారాన్ని మోస్తూ, తోడులేకుండానే నావను ఒడ్డుకు చేర్చాలనే నా కోరిక. ఇంతకన్న వివరంగానే చెప్పవలసిందేమీలేదు. వస్తా!' అంటూ జ్యోతి లేచింది. అతనిపై జాలిపడటం కన్నా, అలాంటి వ్యక్తులకు తగినట్లు పాఠం చెప్పగలశక్తి ప్రసాదించు భగవంతుడా! నేను ఒంటరిదాన్ని కాదు! నీ సహాయంతో కాలాన్ని వేగంగా దాటేయగలను.; అని మనసులోనే ఆ దైవానికి నమస్కరించుకుని చక, చకా వెళ్లిపోయింది తన గదిలోకి.

*